క్లుప్తంగా

మూల పెద్దమ్మ హుండీ ఆదాయం రూ.4.54 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

గడివేముల: మండల కేంద్రంలోని మూలపెద్దమ్మ ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ.4,54,522 ఆదాయం వచ్చినట్లు ఈఓ మోహన్ తెలిపారు. శుక్రవారం ఆలయ ఆవరణలో హుండీ కానుకలను లెక్కించామన్నారు. అలాగే జాతర సందర్భంగా తలనీలాల సేకరణకు వేలం పాట నిర్వహించగా రూ.1,67,588 ఆదాయం వచ్చిందని చెప్పారు. కర్నూలు అసిస్టెంట్ కమిషనర్ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ తలారి చిన్నన్న, ధర్మకర్తలు కేశవరావు, పెద్దమాచెర్లు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓటు హక్కుపై ర్యాలీ

పాణ్యం: మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో ఓటుహక్కుపై శనివారం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి కర్నూలు జేసీ, పాణ్యం నియోజకవర్గ ఈఆర్ఓ నారపురెడ్డి మౌర్య హాజరవుతారని చెప్పారు. ఉదయం 9 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. కాగా మోడల్ పోలింగ్ కేంద్రంగా కొత్తూరును ఎంపిక చేసినట్లు తెలిపారు.

గణిత పరీక్షకు 42 మంది గైర్హాజరు

సి.బెళగల్: పదో తరగతి గణిత పరీక్షకు శుక్రవారం మండల వ్యాప్తంగా 42 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కొత్తకోట జిల్లా పరిషత్ పాఠశాలలోని ఏ సెంటర్‌లో 12 మంది, బీ సెంటర్‌లో ఏగుడురు, ఏపీ మోడల్ స్కూల్‌లో ఏడుగురు, సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్‌లో 8, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 8 మంది చొప్పున మొత్తం 42 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ ఆదామ్‌బాషా తెలిపారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు



బిలకలగూడూరు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

గడివేముల: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలో గ్రామస్తులు, పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. గ్రామాల్లోకి కొత్తవారు వస్తే తమకు సమాచారం అందించాలన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు శుక్రవారం 81 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో 0.060 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



లారీ కింద పడిన ద్విచక్ర వాహనం


గడివేముల: మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో నిత్యం ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ సంబంధించిన భారీ వాహనాలు గ్రామంలోకి వస్తుండడంతో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. శుక్రవారం లారీ వెనుక ద్విచక్రవాహనం వెళుతుండగా లారీ ఒక్కసారిగా వెనక్కు వచ్చింది. దీంతో ద్విచక్రవాహనం లారీ కింద చిక్కుకుంది. వాహనదారుడు త్రుటిలో తప్పించుకున్నాడు. భారీ వాహనాలు గ్రామంలోకి రాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు జాబ్ మేళా

కర్నూలు సిటీ: స్థానిక బంగారుపేటలో ఉన్న కర్నూలు డిగ్రీ కాలేజీలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి అయిన వారితో పాటు పది, ఇంటర్, ఐటీఐ విద్యార్హత ఉన్న 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. పిరామల్ ఫైనాన్స్, ముత్తూట్ ఫైనాన్స్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్స్,నవ భారత్ ఫర్టిలైజర్, ఫ్యూజన్ మైక్రో ఫైనాన్స్ కంపెనీల్లో సేల్స్, అసిస్టెంట్ మేనేజర్, రీజినల్ మేనేజర్ ఉద్యోగ అవకాశాలకు మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు,రెజ్యూమ్, ఆధార్ కార్డుతో హాజరుకావాలన్నారు.

ఉత్సవాలకు వేళాయె

- హిందూ ముస్లింలకు ప్రతీకగా రంగస్వామి, రంగల్ దర్వేశిఖాద్రి తిరునాల
- కులమతాలకు అతీతంగా దర్శించుకోనున్న భక్తులు
- రేపటి నుంచి తిరునాల ప్రారంభం



రంగస్వామి ఆలయం



తిరునాలకు ముస్తాబవుతన్న రంగల్‌దర్వేశిఖాద్రి

గడివేముల: మతసామరస్యానికి ప్రతీకగా ఒండుట్ల తిరునాల. గ్రామ సమీప కొండపై లక్ష్మీరంగస్వామి.. కొండ కింద రంగల్ దర్వేశి ఖాద్రీ కొలువై ఉంటారు. రెండు మతాల దేవుళ్ల ఉత్సవాలు ఏటా ఒకేసారి అంగరంగ వైభవంగా జరగడం విశేషం. ఈ నెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు తిరునాల చేసేందుకు ఒండుట్ల, ఎల్‌కే తండా, మంచాలకట్ట తదితర గ్రామాల ప్రజలు ఏర్పాట్లు చేస్తున్నారు. గడివేముల మండలం ఒండుట్ల గ్రామ సమీపంలోని కొండపై ఒకే రాతి గుహలో స్వయంభు లక్ష్మీరంగనాయక స్వామి కొలువుదీరారు. కొండ కింద రంగల్ దర్వేశి ఖాద్రీ స్వామివారు ఉన్నారు. తిరునాల మొదటి రోజు 24వ తేదీ ఆదివారం గని గ్రామం నుంచి లక్ష్మీరంగనాయక స్వామివారిని పల్లకీలో మంగళవాయిద్యాలతో కొండపైకి చేర్చి రాత్రి గరుడ సేవ నిర్వహిస్తారు. కొండ కొండ రంగల్ దర్వేశి ఖాద్రీ స్వామికి గని గ్రామం నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి దర్గాకు చేర్చుతారు. రెండో రోజు సోమవారం ఉదయం రంగనాయక స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. మరో వైపు దర్గా వద్ద కిస్తీ వేడుకలు జరుగుతాయి. చివరి రోజు గ్రామోత్సంతో ఉత్సవాలు ముగుస్తాయి. తిరునాల సందర్భంగా మూడు రోజుల పాటు భక్తుల కోసం గని గ్రామంలో ఆర్కెస్ట్రా, దేవనర్తకి పూర్తి నాటకం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం నంద్యాల, నందికొట్కూరు డిపోల నుంచి ప్రత్యేకంగా బస్సులను నడపనున్నారు. బండలాగు పోటీలు, పొట్టేళ్ల పందేలు నిర్వహించనున్నారు.

భక్తులకు అన్నదానం

తిరునాలకు వచ్చే భక్తుల కోసం యాగంటి ఉమామహేశ్వర నిత్యాన్నదాన సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం చేయనున్నారు. అలాగే ఆర్యవైశ్య సత్రంలో అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు రంగస్వామి ఆలయ చైర్మన్ నల్లల ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

గ్రావెల్ తరలిస్తున్న మూడు టిప్పర్లు సీజ్





సీజ్ చేసిన టిప్పర్లు, గార్గేయపురంలో గ్రావెల్ ప్రాంతాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా మైనింగ్ విజిలెన్స్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం నూతనపల్లె నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న మూడు టిప్పర్లను శుక్రవారం సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తెలిపారు. ఆత్మకూరు–కర్నూలు రోడ్డు వేయడానికి రాజు అనే వ్యక్తి అక్రమంగా గ్రావెల్‌ను తవ్వ టిప్పర్లతో తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. సీజ్ చేసిన టిప్పర్లను కర్నూలు తాలుకా పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. గార్గేయపురంలోని సర్వే నంబర్ 751లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపినట్లు సమాచారం రావడంతో ఆ ప్రాంతాన్ని తనిఖీ చేశామన్నారు. కేసీ కన్‌స్ట్రక్షన్ ఎండీ కిశోర్, గార్గేయపురంకు చెందిన మద్దిలేటి అక్రమంగా గ్రావెల్‌ను తవ్వి తరలించారని విచారణలో తేలిందని.. చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్ ఉన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేద్దాం

గడివేముల: నంద్యాలలో ఈ నెల 28న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న మేమంతా సిద్ధం బస్సు యాత్రను విజయవంతం చేద్దామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తనయుడు కాటసాని శివ నరసింహారెడ్డి అన్నారు. గడివేముల పార్టీ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సంక్షేమసారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేసి వైఎస్సార్‌సీపీ విజయానికి సహకరించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి, నాయకులు దస్తగిరిరెడ్డి, శివానందరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రఘుమాధవరెడ్డి, లింగేశ్వరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించండి



ఈర్లదిన్నెలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ సతీష్

- కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సతీష్

సి.బెళగల్: కోడుమూరు నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ కోరారు. శుక్రవారం కె.సింగవరం, ఈర్లదిన్నె గ్రామాల్లో ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఆప్యాయంగా పలకరిస్తూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరిస్తూ, ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని కోరారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమశేర్ రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి, కె.సింగవరం సర్పంచ్ రవీంద్రరెడ్డి, ఈర్లదిన్నె సర్పంచ్ పెద్దక్క, ఎంపీటీసీ సభ్యులు మణిమోహన్‌రెడ్డి, నడిపి సోమన్న, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు రాఘవరెడ్డి, శేషిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, శంకర్‌రెడ్డి, సత్యనారయణరెడ్డి, మండల కార్యదర్శులు బాయికాటి మద్దిలేటి, ముందరింటి వెంకటేష్, మండల కోఆప్షన్ సభ్యుడు ముల్ల హారున్, మాణిక్యరెడ్డి, చిన్న సోమన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

- మేమంతా సిద్ధం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



పాణ్యం నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, శివనరసింహారెడ్డి

పాణ్యం: వైఎస్సార్‌సీపీ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని శివనరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం పాణ్యంలోని పార్టీ కార్యాలయంలో మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలు దగ్గర పడడంతో నాయకులు, కార్యకర్తలు మరింత చురుగ్గా వ్యవహరించాలని సూచించారు. ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించాలన్నారు. సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులను విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల అవినీతిని మరోసారి గుర్తు చేయాలన్నారు. నాటి టీడీపీ ప్రభుత్వం.. నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన మధ్య వ్యత్యాసాన్ని తెలియజేయాలన్నారు. ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే అందుతున్నాయని తెలిపారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ప్రజలను కోరాలన్నారు.

మేమంతా సిద్ధంను జయప్రదం చేయండి

ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28వ తేదీ నంద్యాలలో తలపెట్టిన ''మేమంతా సిద్ధం''కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, శివనరసింహారెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలిరావాలని కోరారు. ఎంపీపీ ఉసేన్ బీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుమంత్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పాలం చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బరాయుడు, ఎల్లగౌడ్, బొజ్జన్న, ఆటోమాబు, జాకీర్ ఉసేన్, జయచంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి, నాగేంద్ర, శ్రీనివాసరెడ్డి, మహనందిరెడ్డి, శేషారెడ్డి, బాలరాజు, షెక్షావలి, బాబు, రామచంద్రుడు, సత్యాలు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



మద్యం, వాహనాలు, నిందితులను చూపుతున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: కృష్ణగిరి మండలం కోయిలకొండ నుంచి కటారుకొండకు వెళ్లే దారిలో రెండు ద్విచక్రవాహనాలపై తరలిస్తున్న రూ.90 వేల విలువ జేసే 15 కేసుల కర్ణాటక మద్యాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. మద్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో నిఘా వేసి పట్టుకున్నామన్నారు. రెండు ద్విచక్రవాహనాలను, మద్యాన్ని సీజ్ చేసి, తుగ్గలి మండలం మారెళ్ల బల్లె రాముడు, రాంపల్లి రమేష్‌లను అరెస్ట్ చేసి డోన్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా 14రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. సోదాల్లో ఎస్‌ఐ అలీబేగ్, సిబ్బంది హనుమంతు, రఫీ, శంకర్‌నాయక్, విరుపాక్షిరెడ్డి, వెంకటేష్ నాయక్, అన్సర్ బాషా పాల్గొన్నారు.

సెబ్ సిబ్బందికి క్యాష్ రివార్డు

ఈనె 18, 19, 22 తేదీల్లో సోదాలు నిర్వహించి కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్న సెబ్ హెడ్ కానిస్టేబుల్ హనుమంతు, కానిస్టేబుళ్లు నాయక్, డ్రైవర్ వలిబాషాలకు క్యాష్ రివార్డులు అందజేసినట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆయుధం ఓటు



అవగాహన ర్యాలీలో జేసీ నారపురెడ్డి మౌర్య

కల్లూరు: ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పాణ్యం నియోజకవర్గ ఆర్వో, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ వీకర్‌సెక్షన్ కాలనీ, ఇందిరాగాంధీ నగర్ కాలనీలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. అనంతరం వీకర్‌సెక్షన్ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇందిరాగాంధీ నగర్ వరకు నిర్వహించిన ఓటరు అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా నచ్చిన వారికి ఓటు వేయాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆయుధం ఓటు అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం సీజ్



బెల్టు షాపు నిర్వాహకుల నుంచి స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం

కర్నూలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యంపై సెబ్ పోలీసులు నిఘాను తీవ్రతరం చేశారు. కర్నూలు సెబ్ స్టేషన్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా విస్తృత తనిఖీలు నిర్వహించి 126 మద్యం బాటిళ్లు సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి కొనుగోలు చేసి పల్లెల్లో రహస్య ప్రాంతంలో దాచివుంచి ఎక్కువ ధరలకు విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె గ్రామానికి చెందిన కురువ లక్ష్మీదేవి వద్ద 48 మద్యం బాటిళ్లు, అదే గ్రామానికి చెందిన మండ్ల దస్తగిరి నుంచి 30 మద్యం బాటిళ్లు, ఉప్పలపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు నుంచి 48 మద్యం బాటిళ్లు కలిపి మొత్తం 126 బాటిళ్లను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు కర్నూలు సెబ్ స్టేషన్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు

ఆర్‌యూలో ఇన్వర్టర్లు మాయం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఇన్వర్టర్లు మాయమైనట్లు వర్సిటీ ఉన్నతాధికారులు గుర్తించారు. ఆరు నెలల క్రితం కంప్యూటర్ ల్యాబ్స్‌కు సంబంధించి సుమారు 80 ఇన్వర్టర్లు బయటికి తరలించి మాయం చేసినట్లు తెలుసుకున్న వర్సిటీ ఉన్నతాధికారులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నాగుల అంకన్న మాట్లాడుతూ సుమారు రూ.2 లక్షల విలువ చేసే కొన్ని ఇన్వర్టర్లు మాయమైనట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వీసీ ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీస్‌లకు ఫిర్యాదు చేశామన్నారు.

పోస్టర్లకు సున్నం వేశారు

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు (న్యూటౌన్): ఈనెల 21న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'కల్లూరులో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన' కథనంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన అధికారులపై సీరియస్ అయ్యారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నా గోడలపై ఉన్న పోస్టర్ల తొలగింపులో అలసత్వం పనికిరాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత కల్లూరులో ఇంటింటికీ అతికించిన పోస్టర్లను వెంటనే తొలగించాలని నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజను ఆదేశించారు. ఆయన సూచనలతో ఎన్నికల, నగర పాలక సంస్థ సిబ్బంది పరిసర ప్రాంతాలకు వెళ్లి పోస్టర్లకు సున్నం వేయించి కనిపించకుండా చేశారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య



రంగనాయకులు మృతదేహం

కర్నూలు: ఆటో డ్రైవర్ బోయ రంగనాయకులు (40) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గోనెగండ్ల మండలం అగ్రహారం గ్రామానికి చెందిన రంగనాయకులు, సుగుణ దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి పదేళ్ల క్రితం కర్నూలుకు వలస వచ్చి నిర్మల్ నగర్‌లో నివాసముంటున్నారు. రంగనాయకులు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఈక్రమంలో తన తండ్రి వద్ద డబ్బు తీసుకువస్తానని భార్య సుగుణ గురువారం పుట్టింటికి వెళ్లింది. రాత్రి 8 గంటల సమయంలో రంగనాయకులు ఇంట్లో ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఇదే విషయాన్ని భార్య సుగుణకు సమాచారం అందించడంతో ఆమె ఆసుపత్రికి చేరుకుంది. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీ కేంద్రానికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాల్గవ పట్టణ పోలీసులు తెలిపారు.

శాంతిరాంలో క్రీడా పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న ఆర్జీఎం డైరెక్టర్ అశోక్ కుమార్

పాణ్యం: మండలంలోని శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో ఆరో మహాసంగ్రామ్ క్రీడలు శుక్రవారం ప్రారంభమయ్యా యి. ఆర్జీఎం డైరెక్టర్ అశోక్ కు మార్ ప్రారంభించారు. కళాశాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి రోజు త్రోబాల్ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సు బ్రమణ్యం,ఫార్మసీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ శెట్టి పీడీలు పాల్గొన్నారు.

పది పరీక్షకు 39 మంది గైర్హాజరు

ఓర్వకల్లు: మండలంలో శుక్రవారం జరిగిన పదో తరగతి గణిత పరీక్షకు 39 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ–2 ఓంకార్‌యాదవ్ తెలిపారు. మొత్తం ఐదు పరీక్ష కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 953 మందికి గాను 938 మంది హాజరైనట్లు తెలిపారు. 15 మంది గైర్హాజరయ్యారు. అలాగే ప్రైవేట్ విద్యార్థులు 227 మందికి గాను 203 మంది పరీక్షలు రాయగా 24 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వెల్లడించారు.

ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోండి

- కర్నూలు డీఎస్పీ విజయశేఖర్



లద్దగిరిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కోడుమూరు రూరల్: ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ సూచించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని గోరంట్ల, అనుగొండ, లద్దగిరి, అమడగుంట్ల గ్రామాల్లో డీఎస్పీ విజయశేఖర్ ఆధ్వర్యంలో కోడుమూరు సీఐ మన్సురుద్దీన్, ఎస్‌ఐ బాలనరసింహులు, పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమకు నచ్చిన నాయకుడికి నిర్భయంగా ఓటు వేసుకోవాలని సూచించారు. ఎన్నికల వేళ ఎవరైనా గ్రామాల్లో అలజడులు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని డీఎస్పీ సూచించారు.

వెండి పళ్లెం విరాళం



వెండి పళ్లెం అందిస్తున్న దాత నడిపి సుంకన్న

గూడూరు రూరల్: కె.నాగలాపురం గ్రామ దేవత సుంకులాపరమేశ్వరిదేవికి పెంచికలపాడు గజ్జల నడిపి సుంకన్న శుక్రవారం 197 గ్రాముల వెండి పళ్లెం విరాళమిచ్చారు. అమ్మవారి మొక్కులో భాగంగా సుంకన్న కుటుంబ సమేతంగా వచ్చి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ సిబ్బంది కేశవ్‌కు వెండి పళ్లెం అందించి రసీదు పొందారు.

సచివాలయం తనిఖీ



సచివాలయ సిబ్బందితో ఎంపీడీఓ కుమారి జయశ్రీ

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్ల సచివాలయాన్ని శుక్రవారం ఎంపీడీఓ కుమారి జయశ్రీ తనిఖీ చేశారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించరాదని సిబ్బందికి సూచించారు. గ్రామంలో ఎక్కడా రాజకీయ పార్టీల అధినేతలు, నాయకుల ఫ్లెక్సీలు, ఫొటోలు ఉండరాదని, తొలగించాలని సూచించారు.

నీటి పొదుపు అందరి బాధ్యత



పాణ్యంలో అవగాహన ర్యాలీ

పాణ్యం: భావితరాల అవసరాల కోసం ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వాడాలని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, ఏపీఓ విజయరాణి అన్నారు. శుక్రవారం పాణ్యంలో వరల్డ్ వాటర్ డే సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీటి ప్రాముఖ్యత గురించి వివరించారు.